


రామారావు పేక కత్తెరవేస్తూ అనుకున్నాడు

ఈ ఆట తను కొట్టితీరాలని మూడుసార్లు కత్తెరవేశాడు. ఐదుగురికీ ఐదుపదమూళ్లు ముక్కలు పంచాడు. వజ్రాయుధంలాంటి జాకీ జోకర్ కోశాడు. మూతి తుడుచుకుని తన ముక్కలందుకున్నాడు. చేతి ఆట సుబ్బారావు అప్పటికప్పుడే ముక్కలు పేర్చేసి ఆలోచిస్తున్నాడు. 'మూడుసార్లు కత్తెరేశాను కొంపతీసి డీల్‌షో కాదుగదా!' అనుకున్నాడు రామారావు. "ఆ వచ్చింది! కలువుమహత్యంవల్ల లేక తన భార్య శ్యామల గాజులబలంవల్ల వస్తే తనకే డీల్‌షోవడాలి" అనిపించింది రామారావుకి. అసలివ్వాళ రామారావు పేకాటకి రాకపోయి ఉండేవాడు. సెంటర్‌నుంచి ఇంటికి నడిచొస్తున్నప్పుడు రావిచెట్టుకింద పావలాదొరికింది. శుక్రవారం మహాలక్ష్మి అని దుమ్ముదులిపి బాక్‌పాకెట్‌లో వేశాడు.

సెంటర్‌నుంచి రామారావు ఇల్లు ఓ ఫర్లాంగుదూరం ఉంది. మెల్లిగా ఆలోచించుకుంటూ అడుగులేస్తున్నాడు. ఒకటో తారీఖొచ్చిన వారంరోజులకే జేబు ఖాళీ అయిపోయింది. తనకి డబ్బు గురించిన బాధ లేదు. ఎల్లా ఖర్చుపెట్టాలి అని మథనలోపడి తల పగలగొట్టుకోవాల్సిన అవసరంలేదు. ఒకటో తారీఖు జీతంరాగానే తన శ్రేయోభిలాషులు ఐదుగురు తనచుట్టూ అంగరక్షకుల్లా ఉండి తను ఎక్కడికి వెళ్తే అక్కడికి వస్తారు. జీతంలో మూడొంతులు వాయిదాల ప్రకారం ఒప్పుకున్న వారివారి బాకీలకింద జమకట్టుకుని వెళ్ళిపోతారు. మిగిలిన నాలుగోవంతు జీతం జేబులో బిక్కుబిక్కుమంటుండగా ఆఫీసు విడిచిపెట్టి బయటికివస్తాడు. ఈలోగా మరో బాకీదారు తారసపడక ఆ నాలుగోవంతు జీతం ప్రాణం దక్కించుకుంటే బజార్లో ఉన్న చిల్లరకొట్టుదాకా వచ్చి దుకాణాదారుకి సరుకుల బాకీకింద సగం జమకట్టి ఓ వారానికి సరిపడ బియ్యం మళ్ళీ అప్పు చేసి ఇంటికి తీసుకొస్తాడు. మిగతా మూడు వారాలకీ బియ్యం, ఉప్పూ, పప్పూ, కూరా, నారా ఉంటాయి. ఉంటేయేం? తనకి పిల్లనిచ్చి తన చేత పిల్లల్ని కనిపించిన మామగారే చూసుకుంటాడు. ఇహ తన రోజువారీ ఖర్చు, పేకాటకి డబ్బూ అవసరమవుతాయి. ఫరవాలేదు రెండోతారీఖున అప్పు చేయటం పెద్ద కష్టమేం కాదు. నోట్లో నాలిక ఉన్నవాడు అప్పు అడక్క, కష్టపడే చేతులున్నవాడు అప్పుతీర్చకా తప్పుతుందా? కష్టపడి సంపాదించటం కంటే అప్పులమీద బతకడం చాలా హాయి. జీతం నెలకోసారే వస్తుంది. అప్పు ఎప్పుడుపడితే అప్పుడే చేయొచ్చు. ఒకటోతారీఖు వసూళ్ళకి వాళ్ళే తల బద్దలుకొట్టుకొని పంపకం చేసుకుంటారు.

రామారావు దొరికిన శుక్రవారం పావలా జేబులోంచి తీసి చూసుకున్నాడు. బుల్లి పావలా... కొత్తది... ఇది మహాలక్ష్మి! కర్చీఫ్‌తో తుడిచి కళ్ళకద్దుకుని జేబులో వేసుకున్నాడు. పేకముక్కలు సర్‌మని కత్తెర పడుతున్న మధురసంగీతం చెవుల్లో వినిపిస్తోంది. తను షోచేస్తే మిగతాఅందరూ కౌంట్లు ఇస్తున్న దివ్యసన్నివేశం కళ్ళ ముందు కదుల్తోంది. గబగబా అడుగులేస్తూ ఇంటికొచ్చాడు రామారావు

శ్యామల గడపదగ్గర చెంగువాల్చుకు పడుకుని రామారావుకోసం ఎదురుచూస్తోంది. రామారావు రాగానే లేచి వేణ్ణీళ్లు తోడింది. నీళ్లు పోశాలు చేస్తున్నప్పుడు చేతులు పైకి లాక్కున్న శ్యామల గాజులమీదే ఉంది రామారావు దృష్టి. భోజనం చేస్తున్నా శ్యామల ఆకుపచ్చ మట్టిగాజులమధ్య మెరుస్తున్న రెండు బంగారుగాజులనే చూస్తున్నాడు రామారావు.

'ఇవ్వాళ వంట చాలా బావుంది' అన్నాడు రామారావు.

శ్యామల సంతోషంగా నవ్వింది. కూర మరోసారి వడ్డించింది. అంతలో శ్యామల ముఖంలో అనుమానరేఖ తోచింది. రామారావు తనని అనునయిస్తూ మాట్లాడే సందర్భం ఒక్కటే ఉంది. ఒకటి తన దేహంమీది కోరికతోకాని లేక దేహంమీది వస్తువుల కోరికతోకాని.

'చంటిదానికి పండక్కి జూకాలు చేయించాలే!' అన్నాడు రామారావు ఉత్సాహంగా.

శ్యామల అనుమానం ఖాయపడింది. ఎలా చేయిస్తారు? డబ్బెక్కడిది? ఇవన్నీ అడగలేదు. అడిగితే చంటిదానికి ఒక్క జూకాలేంటి తననించి వెళ్లిపోయిన జిగినీ గొలుసు, నెక్లెస్, దుద్దులు, వేసరీ, ఇంట్లో వెండికంచాలు తెల్లారేటప్పటికి ఎలా తిరిగొస్తాయో చెప్పి పెట్టుబడిగా ఓ వస్తువు

ఇమ్మని అడుగుతాడు. అంచేత వినసట్టు మౌనంగా కూర్చుంది. అయినా ఇవ్వడానికి ఇంకా తనదగ్గర ఏముంది కనుక!

రామారావు భోంచేసి వెళ్ళి చంటిదాని దగ్గర పడుకున్నాడు. శ్యామల ఇల్లు సర్దుకుని 'మీకు పక్క వేస్తానుండండి' అంటూ వచ్చింది.

'శ్యామలా' అని మృదువుగా అంటూ నిద్రపోతున్న చంటిదాన్ని ప్రేమగా పొదువుకుంటూ 'ఇటుకూర్చో' అన్నాడు రామారావు.

శ్యామల కూర్చోలేదు. నుంచునే 'చెప్పండి' అంది.

'చెప్తా! కూర్చో!' అన్నాడు రామారావు.

శ్యామల చతికిలపడింది. ముందుకు జరిగి శ్యామల తొడమీద తల పెట్టుకుని శ్యామల కళ్ళలోకి చూస్తూ అన్నాడు 'నా ఖర్మ. ఎప్పటికి తొలిగేను. నాకేం తోచటంలేదు. భయంగా ఉంది.'

'నీకు చెప్తే భయపడతావు. బయట ఓ బాకీదా రున్నాడు. వాడికి వందివ్వాలి,' అంటూ తల తిప్పుకు కళ్ళుమూసుకున్నాడు.

శ్యామల మాట్లాడలేదు.

అయ్యో! అలాగా! ఎంత ఆపదొచ్చిందీ! ఈ గాజులు తీసుకెళ్ళి తప్పుకోండీ! అని శ్యామల అంటుందనుకున్నాడు రామారావు. కాని శ్యామల మాట్లాడలేదు. ఇలాంటి ఆపదలు తప్పుకోటానికి తెచ్చుకొనే ఉపద్రవాలతో రాయయిపోయింది ఆమె. తనేం చేయగలదు? తనకి నోరులేదు. పోట్లాడితే మనుషులు మారతారా? ఈ గాజులుకూడా పోతాయి. పోనీ! ఉండి తన్నేం సుఖపెడుతున్నాయి గనుక!

రామారావుకి నిలకడ పోతోంది. ఈ పాటికి టేబిల్ ఫారమైపోయుంటుంది. గాజులు తాకట్టుపెట్టి వెళ్ళటానికి ఓ అరగంట పడుతుంది. శ్యామల ఎలాగూ మాట్లాడదనుకున్న రామారావు అన్నాడు.

'ఇహ నిన్నెప్పుడూ అడగను...ఇంకేదీ అడగను...రేపటికి ఎలాగైనా తిరిగి పట్టుకొస్తాను...ఆ గాజులు...'

శ్యామల లేచి వెళ్ళిపోయింది. ఒక్క క్షణం ఆగి రామారావు తిరిగిచూస్తే అక్కడ రెండు బంగారుగాజులు. ఒక్క ఉదుటున లేచి అందుకున్నాడు. వంటింట్లో కెళ్ళి 'శ్యామలా' అంటూ భార్యని చేతుల్లోకి తీసుకున్నాడు. బాధగా చేతులమధ్య నలిగింది శ్యామల. లాల్చీ పైజామావేసుకు బయటకు వెళ్తున్న భర్తనిచూస్తూ తలుపుదగ్గర నుంచున్న శ్యామల 'త్వరగా వస్తారుగా' అంది. 'ఓ' అంటూ వెనక్కి చూడకుండా వెళ్ళిన రామారావు శ్యామల కళ్ళనుంచి గడపమీద రాలిన కన్నీటిబొట్లు చూడలేదు.

చేతి ఆటపడ్డ సుబ్బారావు ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు. డీల్‌షో మొహంలా లేదు. డీల్‌షోపడితే ఈపాటికి ముచ్చెమటలు పోసి వణికిపోయేవాడే. కౌంట్ వాలకం మొహాన పంగనామంలా కన్పిస్తోంది. సుబ్బారావు సాయంత్రం ఇంటిదగ్గర బయల్దేరేప్పుడు వంటింట్లోంచి భార్య 'ఏవండోయ్' అని పిల్చింది. 'బజారుకేనా?' అనడిగింది. 'మరేం లైబ్రరీదాకా' అన్నాడు సుబ్బారావు.

ఇల్లంతా హడావుడిగా ఉంది. అత్తగారు మరదలూ వచ్చి తిష్ఠవేశారు. మరదలు శ్రావణమాసం నోములుకూడా యధావిధిగా ఇక్కడే జరుపుకుంటోంది. శనగలూ, పసుపూ, పేరంటాళ్ళు, అందుగ్గాను తను చేసిన అప్పులు కంపుకంపుగా ఉంది ఇల్లు.

'ఇల్లా లోపలికి రండి' అంది సుబ్బారావు భార్య. నడుంచుట్టూ దోపుకున్న చెంగు విప్పుకుని ముఖానున్న చెమట అద్దుకుంది. చీరకొంగు దగ్గర చిల్లులు. 'ఏవిటో పిచ్చి మొద్దు! దీనికి మంచి చీర ఒక్కటీ కొనిపెట్టలేకపోయాను' అనుకున్నాడు సుబ్బారావు. గబగబా పెట్టెతీసి ఐదు పదిరూపాయలనోట్లు చేతిలో పెట్టింది. సుబ్బారావు ఆశ్చర్యపోయాడు. 'ఎక్కడివీ?' అనడిగాడు.

'అమ్మిచ్చింది చీర కొనుక్కోమని... మంచి చీర తెచ్చిపెట్టండీ... పేరంటానికి అందరూ మంచిమంచి చీరలు కట్టుకొస్తుంటే నాకేవిటో చిన్నతనంగా ఉంటుంది...' అంది కళ్ళనీళ్ళు చిప్పిలగా.

నిజమే! దానికో మంచి చీరాలేదు. మంచి నగాలేదు. పొద్దున లేచినప్పటినుంచీ రాత్రి పడుకునేదాకా గొడ్డులా చాకిరీ చేస్తుంది. ముఖాన నవ్వు చెరగదు. అందరికీ అన్నిరకాలుగా చేసిపెట్టి తృప్తిపరచటమే తన జీవితం అనుకుంటుంది. ఆ ఇబ్బందికీ ఈ ఇబ్బందికీ అని ఒక్కొకటీ తన నగలమ్మినప్పుడు కారణం అడక్కుండా కావాలనటం తడవు నవ్వుతూ వొంటిమీంచి వొలిచి ఇచ్చేసింది. ఎప్పుడైనా వాటి ప్రస్తావనవస్తే 'పోనిద్దురూ మంచి రోజులొస్తే మరిన్ని చేయించుకోలేమా?' అని నవ్వేస్తుంది. ఇంత త్యాగం చేయగలిగిన ఇల్లాలికి తనేం చేయగలిగాడు? పైగా అత్తగారి డబ్బుతో భార్యకి చీరకొనిపెట్టాల్సి వచ్చింది. బజార్లో నడుస్తున్న సుబ్బారావు ఇవన్నీ తలుచుకొంటూ దిగజారిపోయాడు. ఇన్ని చీరల్తో మోయలేనన్ని నగల్తో భార్యని ముంచెత్తాలి. అవన్నీ చూసి ఆమె నిలువెత్తు పొంగిపోయి సంతోషంతో ఉబ్బితబ్బిబ్బైపోవాలి. ఆ దృశ్యం చూస్తే చాలు. తన బతుక్కి మరేమీ అక్కర్లేదనిపించింది సుబ్బారావుకి.


చీరల దుకాణంలో అనేక రకాల చీరలు కన్పించాయి సుబ్బారావుకి. తన భార్య ఔన్నత్యానికి ఉదారతకి యాభై రూపాయల చీరలు పేలికల్లా కన్పించాయి. కొంటే రెండువందల రూపాయల కంచి పట్టుచీర కొనాలి. ఆ కంచిపట్టు జరీలో ఆమె మహాలక్ష్మిలా వెలగాలి.

'వెధవ కంచిపట్టు-ఒక్క రౌండ్‌లో కొట్టేస్తాను.' సరాసరి పేకాట టేబిల్‌కి పరుగెత్తుకొచ్చాడు సుబ్బారావు.

'ఎందుకంత ఆలోచన! ఆట లేకపోతే ఆడకయ్యా మహానుభావా' అన్నాడు సుందరం.

కింద ఆటీన్ జాకీ ఉంది. దాంతో సుంద రానికి కలరింగ్ అవుతుంది. కాని సుబ్బా రావు అడ్డంపడి పేకలోకి వెళ్లాడు. అంత మాత్రంచేత సుందరం నిరుత్సాహపడలేదు. నిరుత్సాహ పడటం అతని జీవితంలోలేదు. మెళ్ళో బంగారు గొలుసు ఓ మారు సర్దుకుని రేచుకుక్కలా పేకలో కెళ్లాడు. లైఫ్‌కార్డు తెచ్చుకొని పన్నెండు పండించుకొన్నాడు. మళ్లీ మాట్లాడితే వచ్చే రౌండ్‌లో రెండు కౌంట్లు తింటానికి సిద్ధంగా ఉన్నాడు.

సుందరం షోకిలా పురుషుడు. తండ్రికి ఒక్కగానొక్క కొడుకు. గారాబంగా పెరి గాడు. లక్షలు సంపాదించే తండ్రి సుంద రాన్ని గుడ్డపొత్తిళ్ళలో కాకుండా రూపాయి పొత్తిళ్ళలో పెంచాడు. పట్టు పరుపులమీద నడిపించాడు. కాసులపేర్లు తొడిగాడు. సుంద రానికి వయసొచ్చి బడిచదువులో పరీక్షేమని గ్రహించి బజారుచదువులో పడ్డాడు. తల్లి పోపు డబ్బాల్లో పది రూపాయనోట్లు ఆ పైన తండ్రి జేబుల్లో వంద రూపాయనోట్లు మాయమవుతున్న సమయాన ఓ రోజు తండ్రి సుందరాన్ని 'తన కడుపు చెడబుట్టా వని' చీవాట్లు పెట్టి చితకబాదాడు. చెడ బుట్టిన కొడుకుగా తనకు ఆ ఇంట్లో స్థానం లేదని ఆ రాత్రికి రాత్రే సుందరం పడిపే లుచ్చుకుని ఇల్లువిడిచి వెళ్ళిపోయాడు. ఆ పైన సుందరం తల్లి దిగులుతో మంచాన పడటం 'రా బాబూ!' అని పత్రికల్లో ప్రకటనలు వేయించటం అయాక, సుందరం ఆచూకీ తెలుసుకొని స్వయంగా తండ్రే వెళ్ళి పరిహారంగా ఇరవై వేలిచ్చుకుని కొడుకుని వెంటబెట్టుకు తెచ్చుకున్నాడు. అంతేకాదు, సుందరం తిరిగివచ్చిన వెంటనే మంచి సంబంధం చూసి మహావైభవంగా పెళ్లి చేశాడు. కట్నం లక్షరూపాయలు బ్యాంకులో వేసి, దానిపైన వచ్చేవడ్డీ, నెలవారీగా ప్రోనోట్లమీద వచ్చేవడ్డీ వెరసి రెండువేలు పాకెట్‌మనీకింద ఖర్చుపెట్టుకుంటూ ఇంటి పట్టునే ఉండమని బతిమాలుకున్నాడు సుంద రం తండ్రి. సుందరం సంతుష్టుడై అంగీక



రించాడు. అయితే సుందరం వ్యాపారం తెలిసినవాడు నష్టపోని జాతకం కలవాడు. క్లబ్బుకి వెయ్యిరూపాయలు తీసుకెళ్ళితే దాన్ని ఐదింతలు చేసుకు తిరిగిరావటం మొదలెట్టాడు.

ఆటలో సుందరం ఆడుతున్నాడంటే మిగతావాళ్లు ఆడానికి జంకుతారు. అతని వేళ్ళు మొన తేలివుంటాయి. ఆ వేళ్ళకి పేకముక్కలకి ప్రేయసీ ప్రియసంబంధం ఉన్నట్టనిపిస్తుంది. కావాల్సిన ముక్కలు వెతుక్కుంటూ పరుగుపరుగున వస్తాయి. ఎప్పుడూ గెలవటమేనా ఓ కౌంట్ ఇవ్వాలని ఆడితే అన్నీ పండి తనే ఆటకొట్టేవాడు. అవతలవాళ్ల షోలో ఉన్నవాడు ఒక్కముక్క తెచ్చుకోలేక ఎడారిలో దాహంతో కొట్టు కుంటున్నవాడిలా గిజగిజలాడి ఆఖరికి పోకులు లెక్కపెట్టేవాడు. అలాంటి సుందరం యీ ఆట ఆడుతుంటే పక్కనున్న రాంబ్రహ్మం తనూ ఆడ్డానికి గుండె చెరువా ? . . .

రాంబ్రహ్మానికి పేకాట చెలికత్తెలాంటిది. పేకముక్కలు చూడకుండా అతనికి నిద్ర పట్టదు. అతనికి డబ్బుపోతుందనే బాధ లేదు. కారణం అతనికి డబ్బుపోతుందని ఎలాగూతెలుసు. అతను ఆట గెలవటం కోసం ఎప్పుడూ ఆడడు. ఎప్పుడైనా ఆట గెలుస్తాడూ. అందులో అతని గొప్పతన మేంలేదు. ముక్కలొచ్చాయి ఆటయింది. అంతే. అతనిక్కావలసిందల్లా సాధ్యమై నంత ఎక్కువసేపు ఆడ్డం. అతనికి "డ్రాప్ మాస్టరు" అనే పేరుకూడా ఉంది. సాధ్య మైనంతవరకు డ్రాప్‌చేసి పక్కవాళ్ళ ఆట చూస్తూ ఉంటాడు. అతనికి పక్కవాళ్ళ ఆటచూస్తున్నప్పుడు కలిగినంత మజా తను ఆడుతున్నప్పుడు కలగదు. అంచేత అథవా రాంబ్రహ్మం ఎప్పుడయినా ఆడితే డ్రాప్ చేసిన పక్కవాళ్లు చటుక్కున రాంబ్రహ్మం ముక్కలు లాక్కుని, "ఇటుతేవయ్యా దేవుడా! నీ కెందుకు బాధ" అని వాళ్ళే ఆడేస్తారు.

ఇహ మిగిలినవాడు సోమనాథం. అతను ఇందాకే చొక్కా విప్పేశాడు. చిరిగిన ఖద్దరు బనీను చెమటకు తడిసి పోతోంది. జేబులోంచి బీడీతీసి వెలిగించాడు. సోమనా థానికి చిన్నప్పటినుంచీ పేకాట తెలుసు. వాళ్ళబాబాయి ఆడుతుంటే చిన్నప్పుడు పక్కన కూర్చుని ఆ మెలకువలన్నీ గ్రహించాడు. అదేం చిత్రమో శాస్త్రం నేర్చుకుని తనే రంగంలోకి దిగేసరికి మక్కెడయింది. పట్టుబట్టి డబ్బు పోయినకొద్దీ మళ్లీ మళ్లీ ఆడాడు. పోవటమే తప్ప రాలేదు. దాంతో

అతనికి పగ. పేకముక్కలన్నా రమ్మీ అన్నా తీరని కసి. సాధించాలి... సాధించాలి... వెధవలు, దగుల్బాజీలు, చుంచు మొహంగాళ్ళు ఆటలు కొడుతున్నారు. తనెందుకు కొట్టలేక పోతున్నాడు? ఉన్న అర ఎకరం అమ్మి పేకాటకూర్చున్న రోజున అనుకున్నాడు 'తను లాభంతో లేస్తానని, వచ్చిందాంతో మూడెకరాలు కొంటానని.' కాని మూడోరోజు రాత్రి ఉన్న డబ్బంతా వూడ్చి పెట్టుకుపోయి పక్కవాడి దగ్గర రిక్షా డబ్బులు అప్పుగా తీసికెళుతున్నప్పుడు పేకల్ని ముక్కలు ముక్కలుగా చింపేసి నెత్తురు తాగుదా మనిపించింది. కాని పిచ్చి మొహాలు! వాటిని చింపేస్తామా? వాటిమీద కోపం తెచ్చుకుంటే పాడిఆవుని చంపుకు తిన్నట్టేగదా?

సోమనాథం అన్నగారు కౌలు వసూలు చేసుకుని రాత్రే వచ్చాడు. తల్లి, అన్నగారు సోమనాథం పెళ్ళి విషయం వంటింట్లో మాట్లాడుకుంటున్నారు. సోమనాథం అన్నగారి జేబు తడివిచూశాడు. రెండు పెద్దనోట్లు బనీన్లో కుక్కుకుని 'నా పెళ్ళి సంబంధం మాట్లాడే శుభ ముహూర్తాన నేను పోగొట్టుకొన్నదంతా తిరిగి సంపాదిస్తాను' అంటూ పేకాటకి వచ్చేశాడు.

జోకర్ సర్రున తెగుతోంది. తాచు పాములా కాటేస్తోంది. రామారావు సుబ్బారావు, రాంబ్రహ్మం సోమనాథాలు కాట్లు తిన్నకొద్దీ బాధగా విషం కక్కుతూ కసిగా ఆడుతున్నారు. అందర్నీ కాటేసిన జోకర్ తాచు సుందరానికి పడగపట్టి ఎండ తగలకుండా కాపాడ్తోంది.

రామారావు భార్య శ్యామల గాజులు, సుబ్బారావు కంచిపట్టుచీర ఎప్పుడో సుందరం జేబులోకి వెళ్ళిపోయాయి. రాంబ్రహ్మం బాంక్ ఖాళీ అవగా నిర్వికారంగా ఆట ఆనందిస్తున్నాడు. సోమనాథం చిరుగుల జేబులో పీకేలు నింపుకున్నాయి. ఆట ఎత్తేశారు.

అందరి మనసుల్లోనూ మణుగురాళ్ళు. సుందరం ఇంటికి వెళ్ళే దోవలో 'ఎరిస్టోక్రాట్' విస్కీ కొనుక్కెళ్దా మనుకుంటున్నాడు. తెల్లవారుజాము నాలుగయింది. ఇంటికివెళ్ళి ఏం సమాధానం చెప్పాలో ఒక్కొక్కళ్ళు గుణించుకుంటున్నారు.

రామారావు 'శ్యామలా! ఆ బాదారుకీ చంపేశాడు. ఇంత కాలానికి బాకీ తీర్చానన్న సంతోషంతో సినిమాకి తీసికెళ్ళి వాళ్ళింట్లోనే పడుకోమన్నాడు.'

సుబ్బారావు 'ఈ ఆఫీసరు తగలెయ్య! రాత్రల్లా లెటర్స్ టైప్ చేయించి కొంపకు వెళుతున్నానని యాష్టై లాగేశాడు, ఛటా చోర్!'

రాంబ్రహ్మం 'ఒసేయ్! నా మతిమరుపు పాడుగాను! బస్సులో పర్సు కొట్టేశారే! పోలీసు రిపోర్టిచ్చి మా తమ్ముడింట్లో పడుకున్నాను.'

సోమనాథానికి ఇంటికెళ్ళి చెప్పటానికేం లేదు. ముసలితల్లి 'నాయనా' అని పలకరిస్తుంది. అన్నగారు గుచ్చిగుచ్చి చూస్తాడు. ఈ వేళలో ఇంటికి అసలు వెళ్ళలేడు. అందుచేత ఇప్పటిదాకా తనకి దొరక్కుండా తననించి తప్పించుకు పోయిన ఆ పేక ముక్కల్ని రెండుచేతులా గబగబా కుప్పగా పోగుచేసి (కసిగా ప్రేమగా) గుండెలకు హత్తుకుని ఆ చాపమీదే బోర్లా పడుకున్నాడు.

